# మనస్సే బంధమోక్షములకు మూలకారణము

ఒకటి మంచి యనుచు ఒకటి చెడ్డ యటంచు
సృష్టియందు నిర్ణయింపనగునె
ఇదియునదియు ఒక్క ఈశ్వరుండె చేసె
దీని తత్వమెరుగ నెవరితరము?
ఉన్నమాట తెలుపుచున్న మాట.

విద్యార్థులారా!

నవనాగరికయుగమందు దినదినమునకు అనేక సమస్యలు పెచ్చుపెరిగి పోవుచున్నవి. జీవితమే ఒక తీరని సమస్యగా రూపొందుతున్నది. ప్రయాణసౌకర్యములు అధికం కావటంచేత ప్రపంచమే చిన్నదైపోయింది. ఒక్క ప్రదేశములో సమస్యలు ప్రారంభమైనప్పుడు మరుక్షణమందే ప్రపంచమంతటా యిదే సమస్యలు పెరిగిపోతున్నవి. కారణము, వీటి నివారణకు మానవుడు అనేక విధములైన సులభమార్గములు కనిపెడుతున్నాడు. కానీ, ఈ సులభమార్గములు కనిపెట్టినవారు గుర్తించటంలేదు, 'మార్గములు సులభమైనవేగానీ సమస్యలు అతి కష్టమైనవి' అని. ప్రతి వ్యక్తి చాలా సులభమైన మార్గము కావాలంటారు. తలనొప్పి, మాత్ర వేసుకుంటే పోవాలి. అదే విధముగా అన్ని సమస్యలు కేవలం ఒక్క మాత్రతోనే సరిపోవాలి అనుకుంటారు. అదే విధముగా మోక్షము అతి సులభముగా లభ్యము కావాలి అనుకుంటాము. సులభమంటే ఏమిటి? నివారణ అంటే ఏమిటి? short cut అంటే ఏమిటి? ఇవి గుర్తించుకోటానికికూడా చేతకాని సమస్యలు. ఈ ప్రాకృత జగత్తునందు, ఈ భౌతికమైన జగత్తునందు, ఈ లౌకికమైన జగత్తునందు, ఈ ప్రవృత్తి మార్గమందు ఈ చిన్న చిన్న పదములకే మనము అర్థము గుర్తించుకోలేకపోతున్నాము. పదములు సులభమేకానీ అర్థము అనంతము.

srisathyasaivachanamrutam

## మనస్సులేని స్థానము జగత్తులో కానరాదు

ఈనాటి సమస్యలన్నీ మానవుని సంకల్పవికల్పములద్వారానే అభివృద్ధి పొందుతున్నవి. మనస్సు చాలా విచిత్రమైనది. చాలా విశిష్టమైనది. దీని చర్యలు మరింత ఘనమైనవి. నడతలు ఆశ్చర్యమైనవి. దీనికి ఒక స్వంతరూపములేదు. ఇది ముందుగా mono action చేస్తుంది. రెండింటియందు ప్రవేశపెడుతుంది. కష్టములో ఒక సుఖమునందిస్తుంది. మరుక్షణములోనే తిరిగి కష్టము చేకూరుస్తుంది. ఒక క్షణములో దుఃఖము, మరో క్షణములో ఆనందము. మనస్సులేని స్థానము జగత్తులో కానరాదు. ఎక్కడ చూచినా మనస్సుయొక్క ప్రభావము ప్రత్యక్షమవుతుంది. ఈ సంకల్పముల ప్రభావముచేత మనస్సు సర్వవ్యాపిగా రూపొందుతున్నాది. కనుకనే 'మనోమూలం మిదం జగత్' అన్నారు. జగత్తంతా మనస్సుతో నిండి ఉంటున్నది. మన సుఖమునకు, మన దుఃఖమునకు, మన పాపములకు, మన పుణ్యములకు, మన ఆనందమునకు, మన విచారమునకు సర్వమునకు మనసే మూలకారణము. కనుకనే వేదాంత పరిభాషయందు 'మనయేవ మనుష్యానాం కారణం బంధ మోక్షయోః'. మనస్సే బంధమోక్షములకు మూలకారణమని నిరూపిస్తూవచ్చింది. ఇట్టి మనఃప్రభావాన్ని చక్కగా గుర్తించినప్పుడు మనలను ఎట్టి సమస్యలు బాధించవు. నీ దుఃఖమునకు ఎవరో కారణమని ఊహిస్తున్నావు. నీ ఆనందమునకు ఎవరో కారణమని నీవు భావిస్తున్నావు. కాదు కాదు, నీ ఆనందమునకుగానీ, నీ దుఃఖమునకుగానీ నీవే కారణము. నీ సంకల్పములే మూలకారణము. నీ సంకల్పములకు నీ మనస్సే కారణము. నీ సంకల్పములే నీ సుఖదుఃఖములకు మూల కారణమని గుర్తించివర్తించటమే మానవుని కర్తవ్యము.

## అద్వైత దర్శనం జ్ఞానం

జగత్తులో అనంతమైన సంఖ్యలో జీవరాసులు జన్మిస్తున్నాయి. 84లక్షల జీవరాసుల జాతులుంటున్నవి ఈ జగత్తునందు. వీటిని అండజము, పిండజము, స్వేదజము, ఉద్భిజము అని నాలుగు రకములుగా విభజించటం జరిగింది. అండజమనగా గుడ్డులో పుట్టేది. పక్షులు, క్రిమికీటకాదులు, పాములు యిలాంటివన్నీ గుడ్డులోనుండి పుడతాయి.

sri sathyasaivachanamrutam

ఇవి 21లక్షల జాతులుంటున్నాయి. పిండజము అనగా గర్భముద్వారా జన్మించేవి. మనుష్యులు, మృగములు యివికూడా 21లక్షల జాతులుంటున్నాయి. తదుపరి శ్వేదజములు. చెమటద్వారా పుట్టేవి ఎన్నో జీవులు ఉంటున్నాయి. యివికూడా 21లక్షల జాతులుంటున్నాయి. ఇంక ఉద్భుజము అనగా భూమినుండి పుట్టేవి. ఇవికూడా 21లక్షల జాతులుంటున్నాయి. ఇవన్నీ కలసి 84లక్షల జీవరాసులుంటున్నాయి. వీటిలో మానవుడు అత్యంత ఉన్నతుడని, 'జంతూనాం నరజన్మ దుర్లభమ'న్నారు. 84లక్షల జీవరాసులలో ఒక్క మానవుడు మాత్రమే ఉత్తముడు అన్నారు. దుర్లభము అన్నారు. దేనియందు దుర్లభము? ఆకారమునందా దుర్లభము, తెలివితేటలందా దుర్లభము, యుక్తికుయుక్తులందా దుర్లభము, అందచందములందా దుర్లభము, ఆస్తిపాస్తులందా దుర్లభము, విద్యావిహారములందా దుర్లభము? ఏమీకాదు. ఇవన్నీ దుర్లభమేకాదు. యివన్నీ ప్రాక్టీసుతో లభ్యమయ్యేవి. ఒక కోతి ప్రాక్టీసుచేస్తే సర్కసులో సైకిలు తొక్కుతుంది. కౄరమృగము అయిన పులి రింగ్‌మాష్టరు దగ్గర వినయముగా కూర్చుంటుంది. రింగుమాష్టరు చెప్పినట్లు వింటుంది. ఇవన్నీ ప్రాక్టీసుతో వచ్చేవి! మానవునకుకూడా ప్రాక్టీసుతో వచ్చేవే! యిక ఇతనిలో దుర్లభమైన గుణము ఏమిటి ఉంటున్నది? తనతత్త్వము తాను గుర్తించుకోలేనివి మృగములు, పక్షులు, క్రిమికీటకాదులు. అందుకు భిన్నంగా స్వస్వరూపసందర్శనము కోరి, దానిని కనిపెట్టి అనుసరించి, ఆనందించే గుణము మానవునిది. 'ఆహారనిద్రాభయమైధునాని సమానమేతత్ పశుభిర్నరాణాం, జ్ఞానం నరాణాం అధికం విశేషః'. ఆ జ్ఞానమే లేకపోతే మానవుడుకూడా పశువుతో సమానమే! పశుపక్షిమృగాదులకు, మనిషికి యిదే వ్యత్యాసము. ఏమిటి ఈ జ్ఞానమంటే? భౌతిక జ్ఞానమా, లౌకిక జ్ఞానమా లేక గ్రంథజ్ఞానమా? కాదుకాదు. అద్వైతదర్శనం జ్ఞానం. అంతా ఒక్కటే అనే సత్యమును గుర్తించుటే జ్ఞానము.

### దేహము క్షేత్రము, దేహి క్షేత్రజ్ఞుడు

ఈనాడు ఎన్నో చదువుతున్నాము మనం. సంగీత, సాహిత్య, నృత్య, చిత్ర, శిల్ప ఈ విధంగా ఎన్నో శాస్త్రములు చదువుతున్నాము. ఇవన్నీ ప్రాకృత విద్యలే! జగత్తుకు

srisathyasaivachanamrutam

సంబంధించిన విద్యలే! కానీ ఈ ప్రాకృతముతో మనము పరతత్త్వమును ఎంతమాత్రము పొందలేము. ఇవన్నీ ప్రవృత్తులు. కానీ, మనం తెలుసుకోవలసింది నివృత్తి. నా దేహము సర్వులకు కనిపిస్తున్నాది. నేను మానవదేహమనుకుంటున్నాను. అయితే దేహమును మానవజాతిగా భావిస్తున్నావు. చర్మమునకు ఏమిజాతి? రక్తమునకు ఏదిజాతి? ఎముకలకు ఏమిజాతి? నీ వెంట్రుకలకు ఏమిజాతి? గాలికి ఏమిజాతి? గగనమునకు ఏమిజాతి? నీటికి ఏమిజాతి? నిప్పుకు ఏమిజాతి? ఏమీజాతి లేదు. దేహమునకు మానవజాతి అంటున్నావుగానీ నీ దేహచర్మమునకు ఏమిజాతి? Skin కి skin జాతి, flesh కి flesh జాతి, bone కి bone జాతి. మానవునకు మానవజాతి. అయితే ఈ మానవజాతి ఏమిటి? అదే నిజమైన, దివ్యమైనజాతి. దేహాన్ని ఆధారము చేసుకొని దేహిని ఆదర్శముగా తీసుకొని జగత్తుకు చాటటానికి మనం ప్రయత్నించాలి. దేహము క్షేత్రము, దేహి క్షేత్రజ్ఞుడు. కారులో ప్రయాణము చేసినంతమాత్రమున నీవు కారు కాదు. నీవు డ్రైవరు. కారు వేరు, డ్రైవరు వేరు. నీ దేహము కారు. దేహి డ్రైవరు. ఆ దేహియే దేవదేవుడు. అట్టి దేవదేవతత్త్వము మనము కొంతవరకు గుర్తించాలి.

**దేహము పాంచభౌతికము దేహము కూలక తప్పదెప్పుడున్**
**దేహి నిరామయుండు గణుతింపగ దేహికి చావుపుట్టుకల్**
**మోహనిబంధ బంధనల ముద్రలు లేవు నిజంబు జూడ నా**
**దేహియె దేవదేవుడు మదిన్ గణుతింపగ ఆత్మరూపుడౌ!**

ఆ దేహియే దేవదేవుడు. కానీ యీ ఆధునిక యుగమందు దేహమునకే ప్రాధాన్యతనందిస్తున్నారు, దేహిని విస్మరిస్తున్నారు. అదియే దుఃఖమునకు కారణము. అదియే బాధలకు కారణము. అదియే కష్టములకు కారణము. అదియే విచారములకు కారణము. మనము నిరంతరము శాంతిగా జీవించాలనుకుంటే దేహతత్త్వమును మనము గుర్తించుటకు ప్రయత్నించాలి. ఇది ఒక్క దైవప్రేమతో తప్ప అన్యమార్గములో లభ్యమయ్యేదికాదు.

**పరులనుండి దాచిపెట్టవచ్చునుగాని పరమాత్మనుండి దాచటానికి వీలులేదు**

sri sathyasaivachanamrutam

'శృణ్వంతు విశ్వే అమృతస్య పుత్రః' ఇది ఉపనిషత్తు వాక్యము. నాయనా! నీవు మానవుడిగా భావిస్తున్నావు. నీవు అల్పుడుగా భావిస్తున్నావు. నేను చాలా బలహీనుడనని భావిస్తున్నావు. ఇది బలహీనత. 'అమృతముకంటే అధికమైనవాడవు నీవు. నీ ముందు అమృతము రుచి లేనిదిగా ఉంటుంది. అంతటి రుచి అంతటిశక్తి అంతటి మహాద్భావము నీ హృదయమునందుంటున్నది' అని తెలియజేస్తున్నాయి ఉపనిషత్తులు. ఇలాంటి పవిత్రమైన దివ్యశక్తిని మనం చక్కగా గుర్తించలేకపోతున్నాము. ఎవరికీ తెలియకుండా మనం పాపాలు చేస్తున్నాం, తప్పులు చేస్తున్నాం అనుకుంటున్నాము. 'ఇతరులెరుగకయున్న ఈశ్వరుండెరుగడా' ఎక్కడో మేము స్నానపుగదిలో చేసుకుంటున్నాము. ఎక్కడో రగ్గు కప్పుకొని చేసుకుంటున్నాము అనుకుంటున్నారు మీరు. పరులనుండి దాచి పెట్టవచ్చుగానీ పరమాత్మనుండి దాచటానికి వీలులేదు. మన దోషములే మనకు reaction, reflection, resoundగా వస్తున్నాయి. చేసిన దోషమును మరచిపోతున్నావు నీవు. కష్టములొచ్చినప్పుడు దీనిని గుర్తించుకోలేకపోతున్నావు. ఈ కష్టములు ఎవరిద్వారానో లభ్యమైనాయని నీవు భావిస్తున్నావు. చేసిన కర్మములకు ఫలితము తప్పినవికావు.

**కర్మ దాట వశమా నరుడా కర్మ దాట వశమా**
**చిన్న చెలమలో ముంచిననైనా సప్తసాగరాల్ నించిననైనా**
**కడవెంతో నీరంతేరా కావాలన్నా ఎక్కువ రాదుర ॥కర్మ॥**
**ధనికుడు తృటిలో భికారికాడా పండితుడింతలో పశువైపోడా**
**కళ్ళు పామై కరవను రాదా కర్మ హేతువు కర్మే మూలము ॥కర్మ॥**
**భుజబలమెంతో చూపినగాని మొనగాడనుచు మురిసిననైన**
**ముక్కుకు త్రాడై ముందుకులాగే ఆముగదాడే కర్మరా**
**ఘన పాఠంబులు చదివినగాని కులదేవతలను కొలచినగాని**
**కారడవులకే పోయినగాని కఠిన తపస్సులే చేసినగాని ॥కర్మ॥**

**భగవదనుగ్రహము పర్వతములవంటి పాపములనుకూడా క్షణములో భస్మము చేస్తుంది**

ఒక్కదైవానుగ్రహముతో ఎలాంటి కర్మనైనా దాటవచ్చు. భగవదనుగ్రహము

srisathyasaivachanamrutam

కొండలవంటి కర్మములెడబాసే మందు. పర్వతములవంటి పాపములనుకూడా క్షణములో భస్మము చేస్తుంది. ఆ అనుగ్రహమునకు పాత్రుడు కావాలి. ప్రేమకు పాత్రుడు కావాలి. ఆ దివ్యమైన సంబంధబాంధవ్యమునకు పాత్రుడు కావాలి. అలాంటి సమయమందు ఎలాంటి పాపమైన పరిహారము చేసుకోవచ్చు. ఈ కలియుగమునందు, కుడిచేత్తో చేస్తే ఎడమచేతితో ఫలితములు వస్తున్నాయి. ఎప్పుడో ఏ జన్మమునకో నీవు కాచుకోనక్కరలేదు. అది ఏ రూపములో వస్తుందో ఏ కాలములో వస్తుందో, ఏ స్థితిలో వస్తుందో చెప్పటానికి వీలుకాదు.

**అడవిలోననున్న ఆకాశమున నున్న**
**పట్టణమున నున్న పల్లెనున్న**
**గుట్టమీద నున్న నట్టేటనున్నను**
**మదిని సాయి నిన్ను మరువడెపుడు.**

విద్యార్థులారా! ఎక్కడ ఉండినా వదలదు. అట్టి ప్రేమను మీరు సంపాయించుకోవాలి. అట్టి దయను మీరు పొందుటకు కృషిచేయాలి. అదియే మీరు సాధించవలసిన గొప్ప సాధన. ధనము రావచ్చు, పోవచ్చు. జన్మములుకూడా ఎన్నో ఎత్తవచ్చు. ఒక్కతూరి వస్తే పోదు. పోతేరాదు. పోదు, రాదు. ఈ మూడింటిని మనం చక్కగా గుర్తించుకొనుటకు ప్రయత్నించాలి. వస్తేపోదు, ఏమిటది? అదే జ్ఞానము. జ్ఞానము వచ్చింది, పోయింది. నిజానికి అది జ్ఞానముకాదు. ఒక్కతూరి జ్ఞానము వచ్చెనా తిరిగిపోదు. రెండవది పోయిందా, తిరిగిరాదు. అదే అజ్ఞానము. పోదురాదు, అదే దివ్యత్వముయొక్క ప్రేమ. ఇది వచ్చేదికాదు, పోయేదికాదు. ఒక్కతూరి నీ హృదయములో ప్రవేశించెనా చాలు. ఈ మూడింటిని విద్యార్థులు చక్కగా గుర్తించాలి. కొంతకాలము భక్తి; కొంతకాలము విరక్తి; యీ విధంగా ఉండకూడదు. ఇది భక్తియేకాదు. ఇది రాకపోకలు కలిగిన అజ్ఞానమే! వచ్చేది, పోయేది అజ్ఞానమే! అదియే అహంకారము. అహంకారము వస్తుంది, పోతుంది.

**జన్మాంతర సుకృతంవలన లభించిన ప్రాప్తిని ఈ జన్మలో అభివృద్ధిపరచుకోవాలి**

**కలిమి కలుగునాడు కైలాసపతినైన**
**ధిక్కరించి పాపి తిరుగుచుండు**

sri sathyasai vachanamrutam

**కలిమి తీరగానే కనుపించు దైవంబు**
**ఉన్నమాట తెలుపుచున్నమాట.**

సంపద ఉండినంతవరకు కైలాసపతినైన ధిక్కరించి వాడు తిరుగుచుండు. అదికాదు, గుణమే మన ధనము. ఈ ప్రాకృతమైన ధనములు ఎంతో మారుతుంటాయి. ఈనాడు తండ్రిగారు నీకు 500 రూపాయలు మనియార్డరు చేశారు. ఆ 500 రూపాయలు నోటు చేతిలో పెట్టుకొని నీవు ఆనందపడుతుంటే ఆ 500 రూపాయల నోటు నీ ముఖము చూచి నవ్వుతుందట! 'ఒరే పిచ్చివాడా! సాయంత్రమునకు యింకొకరి చేతిలోకి పోతున్నాను. నీ దగ్గర శాశ్వతముగా ఉండను. ఇలాంటి ముఖములు ఎన్నో చూచాను. ఇంకా ఎన్నో చూడబోతాను. కాబట్టి నేను నిల్చేదాన్నికాద'ని చెబుతుందట! ధనము ఒకచోట నిలుస్తుందా? కాళ్ళక్రింద నీళ్లవలె కదలిపోతుంటాది. కాని అనుగ్రహధనము, ప్రేమధనము, ఆశీర్వాదధనము, అనుగ్రహధనము ఒకతూరి వస్తే తిరిగిపోదు. దీనిని సంపాయించుకోవాలి. జన్మ జన్మల ఫలితముచేత యిప్పుడు ఈ అవకాశము లభ్యమైంది. Past life నుంచి వచ్చిన ధనము వినియోగించుకోవచ్చుకానీ, ఈనాడుకూడా దానిని అభివృద్ధిపరచుకునే ప్రయత్నము చేయాలి. మా నాన్నగారు సంపాయించిన పదివేలరూపాయలు నా దగ్గరుందని ఖర్చు పెట్టుకోవచ్చును. కానీ ఈ పదివేలరూపాయలు ఎంతకాలము వస్తాయి? పదివేలరూపాయలు అయిపోతే నీవు బికారి అయిపోతావు. కనుక పదివేల తండ్రి సంపాదన దగ్గర పెట్టుకొని నీ సంపాదన నీవు ఉపయోగించుకోవాలి. దానినే భగవద్గీతయందు 'క్షీణే పుణ్యే మర్త్యలోకం విశన్తి' అన్నారు. కర్మఫలితము క్షీణించిపోతూనే యిదికూడా క్షీణించిపోతుంది. చిన్న ఉదాహరణము. ఎలక్షనులో నిల్చాడు, ఒక విద్యార్థి. దీనిలో జయమై పోయింది. అసెంబ్లీకి పోయాడు. అసెంబ్లీహాలులో కూర్చున్నాడు. MLA అయినాడు. ఎంతవరకు? 5 సం॥లు. ఒక్కొక్క సంవత్సరము తరిగిపోతూ వచ్చింది. 5 సం॥లు పోతే తిరిగి యింటికి రావలసిందే! అసెంబ్లీలో కూర్చోటానికి వీలుకాదు. అయిపోయింది. తిరిగి ప్రజల మన్ననలను కొంతవరకు సంపాయించుకోవాలి. జన్మాంతరసుకృతంవలన లభించింది, యీ ప్రాప్తి. యిప్పుడుకూడా ఆ ప్రాప్తిని పెంచుకునే పవిత్రభావములు అభివృద్ధి పరచుకోవాలి. అప్పుడు ఆ past, present చేరి future కి

sri sathyasai vachanamrutam

++అయిపోతుంది. నీవు ఈ జన్మములో పవిత్రమైన రీతిలో జీవితము గడపాలి. అందుకున్న ప్రేమను, అనుగ్రహమును నీవు తప్పక బలపర్చుకోవాలి. అప్పుడే దీనిప్రాప్తి మనకు లభ్యమవుతుంది.

**మానవజన్మ వచ్చినది, జన్మరాహిత్యము కొరకే!**

విద్యార్థులారా! మీరు ఎన్ని డిగ్రీలు తీసుకున్నప్పటికిని, ఎంత చదువులు చదివినా, ఏ ఉద్యోగములు చేసినా, ఎంత ధనము సంపాయించినా అన్నీకూడా శాశ్వతముకాదు. ఒక్క కీర్తిని సంపాయించుకోవాలి. మానవజన్మము వచ్చినందుకు కీర్తిని సంపాయించినప్పుడే దానికి సార్థకత. ఎప్పుడు చూసినా యింకా తప్పులు చేస్తూనే ఉంటే యింక ఎప్పుడు నీవు దీనిని తప్పించుకొనేది? ఒక దొంగ ఉన్నాడు. దొంగతనము చేసేది, జైలులో పోయి కూర్చునేది. ఒకరిని చంపి దొంగతనము చేశాడు. వానిని తీసుకొని పోయి 3 సం॥లు కఠినశిక్ష అని జైల్లో పెట్టారు. 3 సం॥లు జరిగిపోయింది. జైలు అధికారి వచ్చి 'నాయనా! నీ గడువు తీరిపోయింది. రేపటి దినము నిన్ను వదలుతున్నాము. నీ తట్టబుట్ట సరిచేసుకో'మన్నాడు. వీడు చేతులు కట్టుకొని చెబుతున్నాడు, 'సార్! రేపో మర్నాడో మరల వస్తానుకదా యివి యిక్కడే ఉండనీయ'మన్నాడు. అంటే ఏమి? యింకా నేను దొంగతనము చేస్తానని వాని ఉద్దేశ్యము. అలాంటి వానికి ఏమిచేసి ఏమి ప్రయోజనము? ఒకతూరి మనము జైలుకి పోతే తిరిగి జైలుకి పోకుండా చూచుకోవాలి. మందులు తినేది దేనికోసమని? ఎవరైనా ప్రశ్నిస్తే రోగనివారణకోసమంటారు. యిది సరైన జవాబు కాదు. ఎందుకు మందు తింటున్నావు? మందు తినకుండా ఉండేకోసం మందు తింటున్నావు. అది సరైన జవాబు. రోగనివారణకోసమంటారు. ఆ మందు ఆ రోగము నివారించవచ్చు. కొత్త రోగము రావచ్చు. అప్పుడు యింకో మందు తినవలసివస్తుందే! మందు తినేది ఎందుకోసమంటే యింక రోగమే రాకుండా ఉండేకోసం. జన్మవచ్చింది ఎందుకోసం? తిరిగి జన్మ రాకుండా ఉండేకోసం. అది సరైన జవాబు. పరీక్షకు ఎందుకు నీవు పోతున్నావు? తిరిగి పరీక్షకు పోకుండా ఉండేందుకు పోతున్నావు. అంతేగానీ పరీక్షకుపోవటం ఫెయిలు కావటం, పరీక్షకు పోవటం ఫెయిల్ కావటం, దీనికా? అదికాదు, తిరిగి పరీక్షకు పోకుండా ఉండాలి. ఇలాంటి జవాబు మనం

sri sathyasai vachanamrutam

గుర్తించి చక్కగా వర్తించటానికి ప్రయత్నించాలి. పిల్లలందరు యిలాంటి దీర్ఘమైన ఆలోచనలు చేయటంలేదు. ఒక చిన్న పదం. 'నిత్యము నేను వస్తున్నాను' అంటారు. నిత్యమనగా ఏమిటి? చాలా పెద్ద అర్థముతో కూడినది. నిత్యమనగా ప్రతి దినము అనుకుంటారు. నిత్యమనగా మార్పుచెందనిది. నిత్యమైనది, సత్యమైనది, త్రికాలాభాద్యమైనది, మూడుకాలములందు మారనిది. అదే నిత్యము. యింత గొప్ప అర్థముగా ఉండిన దానిని నిత్యమంటే దినముగా మనము భావిస్తున్నాము. వేదాంత పరిభాషయందు ఒక్కొక్క పదమునకు అఖండమైన విలువైన అర్థముంటున్నది.

## భగవంతుడు త్రికూటస్వరూపుడు

విద్యార్థులారా! మన జీవితమనేది పారమార్థికజీవితము. కాని, యిప్పుడు మనం జీవించేది, వ్యావహారికము. దీని ఫలితము ప్రాతిభాసికము. పారమార్థికము, వ్యావహారికము, ప్రాతిభాసికము. యీ మూడింటి ఏకత్వము మనం చూడాలి. దీనినే త్రికూటము అన్నారు. త్రికూటస్వరూపుడే భగవంతుడు! త్రికూటమనగా ఏమిటి? సముద్రము. సముద్రము పారమార్థికము. సముద్రములో అలలు ఒకదాని తరువాత ఒకటి పుడుతున్నాయి. యిదే వ్యావహారికము. ఈ అలలు ఎక్కడనుంచి పుడుతున్నాయి? సముద్రమునుంచే పుడుతున్నాయి. సముద్రములో ఏమి ఉందో అదే అలయందు ఉంటున్నాది. సముద్రములో ఏ విధమైన గుణములున్నవో అలలో అవే గుణములుంటున్నాయి. పారమార్థికమనే సముద్రమునుండి వ్యావహారికమనే అలలు పుడుతున్నాయి. ఈ వ్యావహారికమందుకూడా పారమార్థిక భావాలుండాలి. ఈ వ్యావహారికమందుకూడ ప్రాతిభాసికము అయిన నురుగు ఉంటున్నాది. సముద్రమునందు, అలలందు, నురుగునందు ఒకే గుణములుంటున్నాయి. అప్పుడే అలలు అని చెప్పటానికి వీలవుతుంది.

## దైవప్రేమ అనే అమృతము త్రాగినవానికి పునర్జన్మలేదు

విద్యార్థులారా! సచ్చిదానందమనే సముద్రమునుంచి మానవత్వమనే అలలు పుట్టాయి.

sri sathyasai vachanamrutam

దీనియందుకూడా సత్‌చిత్ ఆనందముండాలి. సత్ అనగా ఏమిటి? being. చిత్ అనగా ఏమిటి awareness. ఈ రెండింటి ఏకత్వము ఆనందము. మనము ఆనందము కోరుతున్నాము. చిత్ అనేది మనలో ఉంటున్నాది. సత్‌కూడా మనలో ఉంటున్నాది. బాబా అనే పదములో ఈ సత్యమును నీరు గుర్తించవచ్చును. BABA, double degree. 1st B-Being, A-Awareness, 2nd B-Bliss, A-Ananda. సత్‌చిత్ ఆనంద స్వరూపమే బాబా! ప్రతి మానవునియందు ఈ నాలుగు తత్వములుంటున్నాయి. మన కండ్ల ఎదుట ఎంతమందో మరణిస్తున్నారు. కానీ 'నేను ఉంటాను' అనుకుంటున్నాడు. అదే being చెబుతున్నాది, 'ఒరే! నీవు చచ్చేవాడుకాదు. దేహము పోతున్నాది కాని నీవు చావవు. ఆత్మ సత్యమైనది, నిత్యమైనది' అని. అయితే దేహమునకుకూడా అలాంటి తత్వము రావాలి. అంటే ఏమిటి? దేహము చావకుండా ఉండాలా? కాదు. దేహము పోయినా తిరిగి జన్మములేదు. అట్టి దైవప్రేమ అనే అమృతము త్రాగిన వానికి జన్మలేదు. 'పునర్జన్మ నవిద్యతే'. 'పునరపి జననం, పునరపి మరణం', అదికాదు మనకు. వడ్లగింజ ఉంటున్నది. వడ్లగింజ మట్టిలో వేస్తే 'పునరపి జననం పునరపి మరణం'. దానిపైన husk తీసివేస్తే మట్టిలో పెట్టినా 'పునర్జన్మ నవిద్యతే'. ఆ హస్కే మన అభిమానము. అభిమానమనే husk ఉన్నంతవరకు పునరపి జననం పునరపి మరణం. శంకరులవారు చెప్పారు

**హరిగోవిందా హరిగోవిందా**
**హరిగోవిందా అనరా మందా**
**మృత్యువు దాపున మసలేటప్పుడు**
**వ్యాకరణము నిను కాపాడదురా! ।హరి।**

'ఓ మందబుద్ధీ! నీవు ఏమాత్రం దీనిని అర్థము చేసుకోలేకపోతున్నావు. హరి గోవిందా! హరి గోవిందా! దైవమును స్మరించు. దైవప్రేమ అనుభవించు. అమృతము ఆరగించు. ఆనందమును అనుభవించు, అన్యులకు పంచు. ఆనందమును అనుభవించుటకు ప్రయత్నించు'. ఇదే మానవుని ప్రధాన లక్ష్యము. 'సంపాదించాను, యిండ్లు కట్టాను, అది చేశాను, యిది చేశాను', అని గర్వపడతావు. ఏమి చేసి ప్రయోజనము? పోయే

sri sathyasai vahini amrutam

సమయములోపల వట్టి చేతులతోనే పోవాలి. ఏ ఒక్క చిన్నది వెంట తీసుకుపోవుటకు వీలులేదు. ఇంత మట్టి మనం వెంట తీసుకువెడితే భారతదేశములో మట్టికే రేషను వస్తుంది. తాను కట్టిన యింటిలో ఆ దేహాన్ని ఉంచరు. బయట పెడతారు. ఇలాంటిది దేహము. కాని అలాంటి దేహముతో మనము సాధించవలసినదాన్ని మంచిగా సాధించాలి.

**విద్యార్థులు విద్యతోబాటు ఆత్మతత్త్వముకూడా తెలుసుకోవాలి**

ఆత్మ అమృతముకానీ మనస్సు అనృతము. మనము అమృతమయ జీవితము గడపాలి. ఏమిటి ఆ అమృత జీవితము? దైవప్రేమకు పాత్రులుకావాలి. అది ఒక్కటిఉంటే ఎన్నైనా మనం సాధించవచ్చు. విద్యార్థులు విద్యతోబాటు, ఈ విచక్షణతోబాటు ఆత్మతత్త్వముకూడా తెలుసుకోవాలి. 'అధ్యాత్మ విద్యా విద్యానాం' లోకసంబంధమైన విద్యలన్నీ చిన్న చిన్న కాలువలవంటివి. ఆ కాలువలు సముద్రములో చేరిపోవాలి. సముద్రము ఆధ్యాత్మికవిద్య. 'నదీనాం సాగరో గతిః' నదులకు మరొకచోట స్థానములేదు. అయితే నదులకు కొన్ని గట్లు కట్టాలి. దీనికి గట్టులేకపోతే ఎన్ని గ్రామములు ముంచుతుందో, ఏమి ప్రమాదము తెస్తుందో ఎవరూ చెప్పటానికి వీలులేదు. ఈ ప్రవాహము చాలా వేగముగా పోతుంటాది. చాలా వేగముగా లోతుగా ఉంటుంది. ఇలాంటి ప్రవాహమును మనం సముద్రములో చేర్చాలంటే ఏమి చేయాలి? యిటువైపు ఒక గట్టు అటువైపు ఒక గట్టు కట్టుకోవాలి. అదియే అష్టాక్షరనామము, 'సంశయాత్మ వినశ్యతే' నిస్సంశయముగా ఉంటుండాలి. సంశయమునకు ఏమాత్రము అవకాశము యివ్వకూడదు. రెండవది 'శ్రద్ధావాన్ లభతే జ్ఞానం'. శ్రద్ధ ఒకవైపున, నిస్సంశయము మరొకవైపున యీ రెండు గట్లు కడితే జీవితమనే ప్రవాహము నేరుగా పోయి అనుగ్రహమనే సాగరములో చేరిపోతుంది.

**నామమనే త్రాడుతో స్వామియైన భగవంతుని నాలుకనే గూటమునకు కట్టి ఉంచాలి**

ఈనాడు ఎన్ని జపములో చేస్తున్నారు. ఎన్ని శ్రవణములో చేస్తున్నారు. ఎంత త్యాగములో చేస్తున్నారు. కానీ, ఈ నది ముందుకు పోవటంలేదు. కారణం ఏమిటి? భౌతికమైనదంతా నీవు చేస్తున్నావు. యిదంతా టేపురికార్డు, గ్రామ్‌ఫోను వంటిది.

sri sathyasai vahanamrutam

గ్రామ్‌ఫోన్ ప్లేటు పాడే సమయములో ఏడుస్తారు. కానీ ప్లేటు ఏమైనా ఏడుస్తుందా? ఏ నిమిషములో ఏమి జరుగుతుందో. 'ఏ నిమిషానికి ఏమి జరుగునో ఎవరూహించెదరు?' నిముషనిముషమునకు, క్షణక్షణమునకు జాగ్రత్తగా ఉంటుండాలి. 'తస్మాత్ జాగ్రత జాగ్రత జాగ్రత' అన్నారు. వైస్ చాన్సలర్ చెప్పారు. ఆదిశంకరుల విషయమై చాలా బాగా చెప్పారు. ఆయన చిన్న గ్రామములో పుట్టినవాడు. తనను పీఠాధిపతిగా చేసినప్పుడు ఆదిశంకరులకు ఎట్టి అహంకారములేదు. ఎట్టి మమకారములేదు. ఎట్టి అసూయలేదు. కాని ఆయన తరువాత వచ్చినవారికి మధ్య మధ్య యివన్నీ ప్రవేశిస్తూ వచ్చాయి. ఈ మఠములకు ఒక పద్ధతి పెట్టారు. ఇటువైపు ద్వారం దగ్గర ఒక కాపలాదారు, అటువైపు ద్వారం దగ్గర ఒక కాపలాదారు దండము చేతిలో పట్టుకోవాలి. యిటువైపున అటువైపున ఉండేవారు రెండు వాక్యములు చెబుతూ పోవాలి. ఈ పీఠాధిపతులలో ఒకప్పుడు ఒకాయన అనుకుంటున్నాడు, 'ఆహా! ఈ మఠానికి ఇన్ని భూములున్నాయి. యింతమంది ప్రజలు నన్ను ఆరాధిస్తున్నారు' అని అహంకారముగా తలచుకుంటూవచ్చాడు. తక్షణమే 'తస్మాత్ జాగ్రత జాగ్రత జాగ్రత' అనుకుంటూ వచ్చారు కాపలాదారులు. శంకరులవారుముందే 'ఇటువంటి అహంకారమునకు అవకాశము యివ్వవద్దు. జాగ్రత జాగ్రత' అని హెచ్చరిస్తూ వచ్చారు. అదే జాగ్రత నీలో ఉండాలి. నామమనే తాడుతో నామి అనే భగవంతుని కట్టి నాలుకనే గూటమునకు బిగించాలి. నామమనే తాటిని నాలుకనే గూటమునకు కట్టివేస్తే భగవంతుడు నీ దగ్గరే నిల్చిపోతాడు. నామము త్రాడు. నామి భగవంతుడు. గూటము నాలుక. నీ నాలుకకు కట్టివేయాలి. 'జిహ్వే రసజ్ఞే మధుర ప్రియే త్వం సత్యం హితం త్వాం పరమం వదామి ఆవర్ణయేథాం మధురాక్షరాణి గోవింద దామోదర మాధవేతి'. అంత మధురమైనది భగవన్నామము. మాధవుడంటే ఏమిటి? మా-అనగా మాయ. మా-అనగా లక్ష్మి. మా-అనగా భూమి. అనగా భూమికి, లక్ష్మికి, మాయకు ధవుడు. ధవుడు అనగా భర్త. అధికారి. లక్ష్మికి అధిపతి. భూమికి అధిపతి. మాయకు అధిపతి. యింత అర్థముంటున్నాది, 'మాధవ' అనే పదమునకు. మాయకు యజమాని, లక్ష్మికి తాను యజమాని, ప్రకృతికి తాను యజమాని. అటువంటి యజమానుని మనం పట్టినప్పుడు సర్వము మనకు వశమైపోతుంది. 'ఓ నాలుకా! జాగ్రత్తగా విను! నీకు రుచి తెలుసు. ఎంత

sri sathyasai vachanamrutam

మధురముగా పలుకుతావు! నీవు చాలా గొప్పదానివి. నీ దగ్గరనున్న మహాగుణములు దేనికీలేవు'. ఏదైనా ఒక పదార్థము నాలుకపై పెట్టినప్పుడు మధురంగా వుంటే నేను అనుభవించకూడదని సర్వాంగములకు సప్లైచేసే విశాలహృదయము కలది. అది చేదుగాను రుచిహీనముగాను ఉంటే యిది మనకు వద్దని బయట పారేస్తుంది.

**క్షమ సత్యము క్షమ ధర్మము**
**క్షమ యోగము క్షమయహింస క్షమ యజ్ఞమగున్**
**క్షమ యాచారము క్షమ దయ**
**క్షమయే ఆధారమగును సర్వంబునకున్.**

క్షమ ఒక్క నాలుకకు మాత్రమే ఉంటున్నది. ఎట్లా? సూటిగా ఉన్న దంతములు 32 ఉన్నాయి. కత్తులవలె ఉంటున్నాయి. వీనిమధ్యలో సున్నితమైన నాలుక. ఏ కొంచెం అటుయిటూ అయినా తెగిపోతుంది.

**దైవానుగ్రహమునకు పాత్రులు కావాలి**

ఇలాంటి దుర్మార్గులమధ్యలో మెత్తని నాలుక జీవిస్తున్నాది. నీవు ఆవిధంగా జీవించాలి. దుష్టులమధ్యలోకూడా నాలుకవలె జీవించాలి. రాక్షసులమధ్యలో విభీషణుడు ఎట్లా జీవించాడో అట్లా జీవించాలి. నాలుకకు యీ క్షమ ఉండటం వలన ఎంతకాలమైనా నాలుకకు ప్రమాదము లేదు. కానీ మొట్టమొదట పడిపోయేది మన పండ్లే. ఆ దుర్మార్గులు మొదట పడిపోతాయి. శాంతము కల్గిన నాలుక ఎప్పటికి ఒకే రీతిలో ఉంటుంది. అంతేకాదు, చాలా గౌరవమైన నాలుక. ఒక రూమునుండి యింకో రూముకు పిల్లి, ఎలుక మాదిరి సంచారము చేయదు. ఏ మాటలు వచ్చినా ఎంత ప్రమాదము వచ్చినా, ఆనందము వచ్చినా తన చోటులో తాను నిల్చుకుంటుందిగానీ బయటకు రాదు. యిల్లు, వాకిలి వదలి బయటకే రాదు. ఎప్పుడు ఎంత మాట్లాడినా నాలుక బయటకు రాదు. గౌరవముగా ఉంటున్నాది. ఆ గౌరవమును నిల్పుకోవాలి. అట్టి నోబుల్ప్రైజు మనం పొందాలి. ఆ నోబుల్ప్రైజును మనము అందుకోవాలనుకుంటే దైవప్రేమ మనం పొందాలి. దైవానుగ్రహమునకు పాత్రులు కావాలి. దైవముతో సంబంధబాంధవ్యము పెంచుకోవాలి.

srisathyasaivachanamrutam

రెండు అనేది లేక ఒక్కటిగా కావాలి. Unity in diversity. అప్పుడే మన జీవితము సార్థకమవుతుంది. ఇదియే శంకరులవారు చెప్పిన అద్వైతము. Dual mind ఉండకూడదు. A man with dual mind is half blind. ఉంటే పూర్తి blind గా ఉండు. లేకపోతే పూర్తి దృష్టి తెచ్చుకో; half blind గా ఉంటే పడిపోతావు. మనము half blindగా ఉండకూడదు, half blind అని దేనికి పేరు. కాకికి పేరు. దాని ముక్కు చాలా పొడవుగా వస్తుంది. యిటువైపు ఉండే దాన్ని యీ కన్ను చూడలేదు. అటువైపు నున్నదాన్ని యీ కన్ను చూడలేదు. కాకి కళ్లు యిటూఅటూ తిప్పుతుంటుంది. సూటిగా చూడలేదు. అటుయిటూ చూడటమే చంచలత్వము. చంచలత్వము కాకి గుణము. యిలాంటి గుణమునకు ఏమాత్రం అవకాశము యివ్వకూడదు. I am man, I am man, not animal, not bird. ఆవిధమైన దృఢమైన విశ్వాసము అభివృద్ధి పరచుకున్నప్పుడు చంచలత్వము మనలో ప్రవేశించదు.

**(తేదీ 19-08-1996న కుల్వంత్ హాలులో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam